వార్త

శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు సోమవారం 23 డిసెంబర్ 2024





శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఆగని చికెన్ వేస్ట్ దందా ప్రత్యేక దృష్టి సారించిన కోవూరు పోలీసులు





**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించి పరిసరాలను పరిశుభ్రంగా దుర్వాసన వెదజల్లుతున్న చికెన్ వేస్ట్‌ను డిసెంబర్ నెల నుంచి కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎక్కడా కూడా ఈ వాహనాలను రానివ్వవద్దని ఇది వరకే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీనిపై వీపీఆర్ నివాసంలో పోలీస్ , మత్స్యశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్‌లు ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ ప్రాంతాల్లో చికెన్ వేస్ట్ రవాణా కాకుండా ప్రత్యేక దృష్టి సారించారు. అయినా కూడా ఈ చికెన్ వేస్ట్ రవాణాకు అలవాటు పడ్డ మాఫియా కొత్త దారులు తొక్కుతూ అర్థరాత్రి వేళల్లో ఈ రవాణాకు తెర తీశారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున చెన్నై నుంచి కోవూరు వైపు వస్తున్న చికెన్ వేస్ట్ వాహనాన్ని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు ఈ వాహనాన్ని ఆపి పరిశీలించి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కోవూరు ఎఫ్‌డీవో శ్రీనివాసులు కోవూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఈ చికెన్ వేస్ట్ తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయించారు. అనంతరం ఈ చికెన్ వేస్ట్ వాహానాన్ని పెన్నానది ప్రాంతంలో గొయ్యి తీసి అందులో పూడ్చేలా చర్యలు చేపట్టారు



## 3 లక్షలా 92 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కొలమల శ్రీనివాసులుకి గుండె ఆపరేషన్ నిమిత్తం భారీ మొత్తంలో ఖర్చు అయినది దాని నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 3లక్షలా 92 వేలు చెక్కును కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా కొలమల శ్రీనివాసులుకు అందజేసినట్లు తెలుగుదేశం నాయకులు తాళ్ళ నరసింహస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యర్ర ధనుంజయ, ఆశం సురేష్, చప్పరం మల్లికార్జునరావు, కన్నా బ్రహ్మయ్య, మారెం మురళీకృష్ణా, యారాశి రామారావు, దోనిపత్తి వెంకటరమణయ్య, కొలమల లక్ష్మీదేవి, కొలమల శివకుమార్ 17 వవార్డు కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

## బోన్‌డెన్సిటీ టెస్ట్ పెట్టటం ఇదే తొలిసారి



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** మెడికల్ క్యాంపులలో బోన్ డెన్సిటీ టెస్టు పెట్టడం ఇదే తొలిసారి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆదివారం నగరంలోని జెండా వీధిలోని , కోటమిట్టలోని షాదీ మంజిల్‌లో టీడీపీ మైనార్టీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ షరీఫ్ సౌజన్యంతో రెయిన్‌బో ఆసుపత్రి వారు మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపు ను ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అజీజ్ మాట్లాడుతూ నామమాత్రంగా కాకుండా అద్భుతమైన మెడికల్ క్యాంపును రెయిన్‌బో ఆసుపత్రి వారు నిర్వహించారన్నారు. వివిధ వైద్యుల ద్వారా దాదాపు 500 మంది మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు. రెయిన్‌బో ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ అమలులో ఉంది. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడి వెళ్ళిపోయిన ఆసుపత్రులు తిరిగి ఎన్టీఆర్ వైద్య నమోదు చేసుకోవాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వంలో విద్య వైద్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మైనుద్దీన్, ఉస్మాన్, రబ్బాని, నౌషాద్, ఇంతియాజ్, జాఫర్, అజీజ్ మౌలానా, అష్రాఫ్, శ్రీదేవి, గౌనుస్నిస, జమీర్, రేష్మ, హఫీజ్, షరిన్, సుష్మా సింగ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవరదరాజస్వామి వారి సన్నిధిలో శ్రీరంగం శ్రీమద్ అండవాన్



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీశ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరదరాజస్వామి వారిని ఆదివారం శ్రీరంగం శ్రీమద్ అండవాన్ శ్రీపౌండరీపురం పీఠాదిపతులు శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఇఒ ఆలయ అర్చకులు ,దేవస్థానం సిబ్బంది వారికి ఘనస్వాగతం పలికారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# క్రీడాకారులకు విద్య, ఉద్యోగావకాశాలు మెండు

### అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్ బాల్ పోటీలు







**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త :** క్రీడాకారులకు ప్రభుత్వం విద్యా, ఉద్యోగావకాశాల్లో ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతంకు పెంచిందని ప్రాంతీయ వ్యాయామ విద్యా పర్యవేక్షకులు మహబూబ్ బాషా తెలిపారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం 53వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్ బాల్ పోటీల ప్రారంభం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో క్రీడా రంగంలో మరిన్ని ప్రోత్సాహాలు అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఒలంపిక్స్‌లో మెడల్ సాధిస్తే 7 కోట్ల రూపాయలు సంబంధిత క్రీడాకారులకు నగదు నజరానా ఉంటుందని ప్రకటించిందన్నారు. దీంతో క్రీడాకారులు మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్తున్నారన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి ఈ హ్యాండ్ బాల్ పోటల్లో క్రీడాకారులకు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర జట్టుకు వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన ఈ రాష్ట్ర జట్టు త్వరలో బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రస్తుతం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌బాబు క్రీడాభివృద్ధి ప్రభుత్వ పాఠశాలల్లో మరింత ప్రోత్సహించేందుకు గానూ రాష్ట్రంలో ఉన్న 40 వేల పాఠశాలలకు 13 కోట్ల మేర క్రీడా పరికరాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చర్చించుకుని వారికి అవసరమైన క్రీడా పరికరాలను కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ఉన్నత పాఠశాలకు 30 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు 20 వేలు, ప్రాథమిక పాఠశాలకు 10 వేలు చొప్పున ఈ క్రీడా పరికరాల కొనుగోలుకు నిధులను వాడుకోవచ్చున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పాటూరు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భీమతాటి వెంకటరమణయ్యను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా దృష్టి సారించేలా ప్రభుత్వం చూస్తుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇంకా రాష్ట్ర వ్యాయామ విద్యా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. ప్రభాకర్‌రెడ్డి, గ్రా మ సర్పంచ్ శ్రీదేవి, జిల్లా హ్యాండ్ బాల్ కమిటీ కన్వీనర్ విక్టర్, ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసి యేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. రామాంజనేయులు పలు విషయాలను క్రీడాకారులకు తెలియజేశారు.

**ఆకట్టుకున్న మార్చ్ ఫాస్ట్** 53వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్ బాల్ పోటీల సందర్భంగా ఆదివారం క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 16 జిల్లాల క్రీడాకారిణుల మార్చ్ ఫాస్ట్ ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని గ్రామ సర్పంచ్ శ్రీదేవి వెలిగించారు. అనంతరం క్రీడా ప్రమాణాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పాటూరు గ్రామ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, మురళి, మధు, సుకుమార్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు నాయుడు, 16 జిల్లాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

# దేశంలోనే సీట్లను సాధించడంలో నారాయణ విద్యాసంస్థలే ముందంజ



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** మెడికల్ సీట్లను సాధించడంలో నారాయణ విద్యాసంస్థల్లోని విద్యార్థులే ముందంజలో ఉంటున్నారని, దానిని ఎవ్వరు టచ్ చేయలేరని 2024 సక్సెస్ మీట్‌లో డీన్లు జయకుమార్‌రెడ్డి మహేష్, మధుసూదన్‌రెడ్డి శ్రీనివాసులు ఉద్ఘాటించారు. నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో ఉన్న ఆడిటోరియంలో 2024 నీట్‌లో ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగంలో నారాయణ విద్యాసంస్థలకు ఒక బ్రాండ్ ను క్రియేట్ చేశామన్నారు. ఎప్పటికి ఆ బ్రాండ్ హై రేంజ్‌లోనే ఉంటుందని విద్యాసంస్థల అధ్యాపకులు అన్నారు. నాలుగు దశాబ్దాలుగా పోటీ పరీక్షల్లో తమ స్థానం పదిలంగానే ఉంటుందన్నారు. మెరుగైన ర్యాంకులు సాధిస్తూనే ఉంటామని వారు స్పష్టం చేశారు. దేశంలోని ప్రతిష్ఠాత్మకంగా మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందిన వారందరూ నారాయణ కాలేజీలో చదివిన వారే ఉండటం గర్వకారణమన్నారు. 2024 నీట్‌లో దాదాపు 350 మంది విద్యార్థులకు మెడికల్ సీట్లు వచ్చాయన్నారు. ఉత్తమ బోధన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెటీరియల్, నిరంతర పర్యవేక్షణతోనే ఇదంతా సాధ్యమైందన్నారు. అసాధారణ ఫలితాలను ఇంకెవ్వరూ సాధించలేని విజయాలను ఒక్క నారాయణ మెడికల్ కాలేజీ సాధిస్తుందని చెప్పడానికి గర్వంగా ఉందని వారు వెల్లడించారు. అనంతరం విద్యార్థినీలు నిర్వహించిన డ్యాన్సులు అందరికి ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు మాస్ డ్యాన్స్‌లు, అదరగొట్టే స్టెప్‌లతో ఆడిటోరియం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# నెమిలి అభయారణ్యంగా మారుతున్న పాత గన్నేపల్లి ఏరియా



### గండిపాలెం బ్యాక్ వాటర్ కొండలోగిలిని ఆవాసానికి ఎంచుకొన్న జాతీయ పక్షి

### సంరక్షణ చర్యలతో పక్షి పర్యాటక కేంద్రంగా మారే అవకాశం

**ఉదయగిరి, డిసెంబర్ 22, ప్రభాతవార్త** ఉదయగిరి ప్రాంతంలో నెమిలి పక్షులు తమ సహజ రక్షిత ప్రాంతంగా గండిపాలెం జలాశయం బ్యాక్ వాటర్ ఏరియాలో ఒక లోగిలిని ఎంచుకొన్నాయి. తమ మనుగడకు, పరిరక్షణకు అనుకూల ప్రాంతంగా చుట్టు నీళ్ల ఉన్న ఒక కొండలోగిలిని ఎంచుకున్నాయి. తమ సంతానోత్పత్తికి, ఆవాసానికి, సంరక్షణకు అత్యంత అనుకూలమైనదిగా భావించి ఈ ప్రాంతంలో విహరిస్తున్నాయి. ఉదయగిరి కొండల్లో ఉన్న ఈ పక్షులు తరచు జలాలకై ఇక్కడికి వస్తూ ఈ ప్రాంతంలో ఆవాసాన్ని ఏర్పరచుకొన్నాయి. పాత గన్నేపల్లి ఏరియాగా పిలువబడే ఈ లొకేషన్‌లో నెమిలి పక్షులు పురివిప్పి పరవశం చేస్తున్నాయి. వాటి హోయలు మనసును దోస్తున్నాయి. కొన్ని శతాబ్దాల తర్వాత అందమైన జాతీయ పక్షులు సమూహం కనిపించడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పక్షుల వృద్ధికి అవసరమైన చర్యలు చేపడితే ఈ ప్రాంతం గొప్ప పక్షి కేంద్రంగా మారే అవకాశం ఉంది. పొంచి ఉన్న వేటగాళ్ళ ముప్పు ఉడుములు, ముంగిసలు, అడవి పిల్లలు, కుందేళ్లు, కౌజులు వేటగాళ్ళు దృష్టి ఈ ప్రాంతం మీద పడిందని స్థానికులు చెబుతున్నారు. ఇతర పక్షుల వేట పేరుతో కళ్ల గప్పి నెమళ్ళ కోసం వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నెమళ్ళవృద్ధి, సంరక్షణకు పాటు పడాలని కోరుతున్నారు. నెమళ్ల మన జాతీయ పక్షి కాబట్టి మనం కాపాడుకునేది ఎంతైనా అవసరమని పెద్దలు అంటారు. జంతువులు గాని పక్షులు గాని మనం దగ్గరకు తీసుకొని మన రక్షణలో పెంచుకుంటే అవి మనల్ని వదిలిపోవు జంతువైన అంతే పక్షి అయిన అంతే కొంత మంది జంతువులను ప్రేమిస్తూ ఉంటారు. కొంత మంది పక్షులను ప్రేమిస్తూ ఉంటారు.

# రాళ్లపాడు ప్రాజెక్టు రైతులకు పూర్తి స్థాయిలోనీరు అందిస్తాం

### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**కందుకూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త** రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ కింద వరి సాగు చేసిన రైతులకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు కుడికాలువను పరిశీలించారు. గత 15 రోజుల నుండి కుడి కాలువ తూము తలుపు తెరుచుకోకపోవడంతో కాలువకు నీటి సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుండి అధికారులు అనేక ప్రయత్నాలు చేసినప్పటికి సమస్య కొలిక్కి రాలేదు. దీంతో సైఫనులు ద్వారా, మోటార్ల ద్వారా నీటిని కాలువకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా కాలువకు వచ్చే నీరు సరిపోకపోవడంతో కింద గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నీఇ పరిమాణ పెంచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కుడి కాలువ వద్ద పరిస్థితిని కలెక్టర్‌కు ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి వివరించారు. తూము ద్వారా నీటిని విడుదల చేస్తేనే ఎత్తు కాలువలకు నీటి పారుదల ఉంటుందని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ మోటార్లను 10 రోజుల ముందు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నీరు రాకపోవడంతో వరి నాట్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే గేటు సమస్యను పరిష్కరిస్తామని ఈ పాటికి మెగా ఇన్ ఫ్రా నిపుణులు వచ్చి పరిశీలించారని అన్నారు. ప్రస్తుతం రైతులందరికి నీటినందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని త్వరితగతిన రైతులకు అవసరమైన నీటిని కాలువకు విడుదల చేసేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడి కాలువకు 120 క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతుందన్నారు. కాలువ పరిమాణం 220 క్యూసెక్కులు ఉందని, 160 క్యూసెక్కులు నీటిని కాలువకు విడుదల చేసేలా రెండు మోటార్లు బిగించడం జరుగుతుందన్నారు. కరీంనగర్ నుంచి తీసుకువచ్చిన నాలుగు మోటార్లలో రెండు మోటార్లు ద్వారా నీటిని కాలువకు విడుదల చేసి అవసరమైతే మరో మోటారు కూడా బిగించి నీటిని ఇవ్వడం జరుగుతుందన్నారు. అధికారులు కాలువ తూమును తెరిచేందుకు ప్రయత్నిస్తున్నారని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, అధికారులు పాల్గొన్నారు.

**మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం :** జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పరుగులు పెట్టింది. గత 15 రోజుల నుండి రాళ్లపాడు కుడి కాలువ తూము గేటు సమస్య కొలిక్కి రాకపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. దీంతో చిన పవని గ్రామానికి చెందిన కొందరు రైతులు శనివారం అమరావతిలో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడిని కలిసి సమస్యను వివరించారు. కాలువకు నీటిని విడుదల చేయకపోతే చాలా మంది రైతులు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతింటారని, 20 అడుగులు నీరు ప్రాజెక్టులో ఉన్న రైతులకు నీటిని విడుదల చేయడం లేదని ఒక వైపు వరి నాట్లు ఎండిపోవడం, మరో వైపు వరి నారు ముదిరిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఫొటోలు చూపించారు. అధికారులు చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదని ఆయనకు వివరించారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి కలెక్టర్‌తో అధికారులతో మాట్లాడారు. వెంటనే కాలువకు నీటిని విడుదల చేసి రైతులకు అవసరమైన నీటి పరిమాణాన్ని పెంచాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి కుడి కాలువ తూము వద్దకు వచ్చి పరిశీలించి విషయం తెలుసుకున్నారు.



## ఉలవపాడు గ్రంధాలయంలో చదవడం మాకిష్టం



**ఉలవపాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడులోని స్థానిక శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయ అధికారి దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో నీటి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞాన దాయకమైన పుస్తకాలను చదివించి ఆ కథల్లో గల నీతిని గ్రంథ పాలకుడు వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అలాగే ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ అందించి క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా ఉలవపాడు శాఖా గ్రంధాలయానికి అనుబంధంగా ఉన్న చాకిచర్ల గ్రంధాలయంలో కూడా లైబ్రేరియన్ రాణిమ్మ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నేడు ధర్నాను జయప్రదం చేయండి



**ఉలవపాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** నేడు కందుకూరు నియోజకవర్గంను ప్రకాశం జిల్లాలో కలపాలని కందుకూరు పోస్టాఫీసు వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10గంటలకు ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలకు అతీతంగా జరుగు ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు. అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు అన్నట్లుగా ఉద్యమాలు చేయకుండా ఏదీ సాధించలేమని దానిలో భాగంగానే రాజకీయాలకు అతీతంగా ధర్నా జరుగుతుందని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్ష ప్రకాశం జిల్లాలో కందుకూరు నియోజకవర్గం కలపాలని ఉన్నందున ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

## ఇండిగో పెయింట్స్ వారి సహకారంతో రంగులు వేసే కార్యక్రమం



**ఉలవపాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బిల్డింగ్‌కు ఇండిగో పెయింట్స్ వారి సహకారంతో చక్కగా రంగులు వేయడం జరిగింది. ఇండిగో పెయింట్స్ వారు ఉచితంగా స్థానిక పెయింటర్స్ సహకారంతో ఈ బిల్డింగ్‌కి పెయింట్స్ వేయడం జరిగింది. అందుకు ప్రతిఫలంగా పెయింటర్స్‌కి బహుమతులు, ఇండిగో పెయింట్ తరుపున జీవిత భీమా సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు ఇతర ఉపాధ్యాయులు పూర్తి సహకారాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా భీమవరం ఉలవపాడు, కరేడు ,సింగరాయకొండ గ్రామాలకు చెందిన సుమారు 50 మందికి పైగా పెయింటర్స్ భవనానికి పెయింట్స్ వేయడంలో సహకరించారు. విద్యార్థినీ, విద్యార్థుల సౌకర్యం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇండిగో పెయింట్స్‌కు చెందిన కంపెనీ మేనేజర్ మల్లిఖార్జునరెడ్డి అదే విధంగా సేల్స్ ఎగ్జిక్యూటీవ్ మెహిత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఇండిగో డీలర్ మనోజ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ బృహత్కర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. అనంతరం జరిగినటువంటి సభలో పెయింటర్స్ విలేకర్లు ఇండిగో కంపెనీ ప్రతినిధులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతి ప్రధానం చేయడం జరిగింది.

## ఘనంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు సంహిత్ జన్మదిన వేడుకలు



**సీతారామపురం డిసెంబర్ 22 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కఠిక సిద్దేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంహిత్ జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. శివాలయం వద్ద పూజలు అభిషేకాలు నిర్వహించి పరమేశ్వరుడ్ని దర్శించుకున్నారు.ఇష్ట కామేశ్వరీ ఆలయంలో అమ్మవారి దగ్గరం కుంకుమార్చన చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం పోలంగారిపల్లి గ్రామంలో అంకళమ్మ తల్లి దేవస్థానంలో టిడిపినాయకులు బాలినేని రమణయ్య,బాలినేని వెంకటేష్ ఏర్పాటు చేసి బోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం సోము పల్లి గ్రామంలో సెమి క్రిస్మస్ నేలటూరు జాషువా నిర్వహించిన సెమి క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంహిత్ పుట్టి రోజు సందర్భంగా కేకు కట్ చేసి పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నాసేవ నావంతు కమిటి రాష్ట్ర కమిటి సభ్యులు బోగినేని కాశీరావు, ఎదమ ప్రవీణ్, సింగాల నాగేష్,పిడుగు రమేష్, ఇజ్రాయిల్, బొగ్గవరపు రత్నం, తోటా మనోజ్, బోగినేని కాశీరత్నయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల హక్కులకై నిత్యం పోరాడేది మహిళా సమాఖ్య




**కందుకూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** దేశంలో మహిళల రక్షణకు వారి హక్కులను కాపాడటంలో ముఖ్య పాత్ర పోషించి పోరాటాలు చేసేది ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాత్రమేనని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు వి.జయలక్ష్మి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కందుకూరు మండల జనరల్ బాడీ సమావేశం కారంశెట్టి ఇంద్రజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు వి.జయలక్ష్మి పాల్గొన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జెండాను ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి తుదసి రావమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఏఐకేఎస్ రావుల వెంకయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం సనాతన ధర్మాన్ని తీసుకొని రావాలని ప్రయత్నాలు చేస్తుందని, దానిని అరికట్టాల్సిన అవసరం అందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే మహిళలు చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమలో ఏపీ మహిళా సమాఖ్య ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి సుదర్శి రావమ్మ, ఏపీ మహిళా సమాఖ్య ప్రకాశం జిల్లా కార్యదర్శి రావులకొల్లు లక్ష్మి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయుసీ నియోజకవర్గ కార్యదర్శి యర్రంశెట్టి ఆనంద మోహన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కందుకూరు నాయకులు శైలజ, కల్పన, జ్యోతి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఈనెల 29న జరగనున్న బలిజ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



**సీతారామపురం డిసెంబర్ 22 ప్రభాతవార్త :** నెల్లూరు కాపు భవన్‌లో ఈ నెల 29 న నిర్వహించనున్న బలజి ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని సీతారామపురం మండల బలిజ సంక్షేమ సంఘం నాయకులు కోరారు.సీతారామపురం ఆదివారం విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు ఆత్మగౌర సభలో కాపునాడు చైర్మన్ మిరియాల వెంకట్రావ్ జయంతి వేడుకలు,వంగవీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు.సీతారామపురం మండలంలోని బలిజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈకార్యక్రమంలో సిగే కొండయ్య,రామిశెట్టి తిరపతయ్య, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, గుండా సురేష్, పసుపులేటి వికాస్ బాబు ,బాలయ్య, కాశయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## కాకర్ల యువసేన ఆధ్వర్యంలో రక్తదానం




**వింజమూరు,డిసెంబర్22,ప్రభాతవార్త:** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కాకర్ల సంహిత్ పుట్టినరోజు సందర్భంగా వింజమూరులోని బొమ్మరాజు చెరువులోని కాకర్ల ట్రస్ట్ కార్యాలయంలో కాకర్ల యువసేన ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. యువత పెద్దఎత్తున ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మొక్కలను నాటారు. రక్తదానం చేసిన యువతను ఎమ్మెల్యే అభినందించారు. రక్తదానం మరొకరికి ప్రాణదానమని, యువత రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో కాకర్ల యువసేన సభ్యులు తమ్మినేని మనోప్రకాష్, పిచ్చిపాటి పవన్‌కళ్యాణ్, పిచ్చిపాటి భార్గవ్, ఉమాసాయిరాం, ఇమ్రాన్, జిర్రా మాల్యాద్రి, కాకర్ల వెంకటసుబ్బానాయుడు, మస్తానమ్మ, కడియాల వెంకటేశ్వర్లు,పద్మావతి, రావిపాటి సాంబయ్య, మాలెపాటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లపాడు ఆయకట్టు పంట పొలాలకు ప్రత్యామ్నాయంగా నీరు

### - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



లింగసముద్రం, డిసెంబర్ 22, ప్రభాతవార్త లింగసముద్రం మండలం రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు ప్రత్యామ్నాయంగా మోటార్ల ద్వారా నీరు అందిస్తున్న పనులను పరిశీలించారు. గత పది రోజుల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటు మరమ్మత్తు పనులు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే పర్యవేక్షిస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో ఆయకట్టు రైతుల పంట పొలాలకు సరిపోవడం లేదని తెలుసుకున్న రైతుల పంట పొలాలకు సరిపోవడం లేదని తెలుసుకున్న ఆయన సమస్యను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. పంటలు ఎండిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు వద్ద ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి మెగా సంస్థ ద్వారా పోలవరం డ్యామ్ వరద నీటిని పంపింగ్‌కు ఉపయోగించే పెద్ద పెద్ద మోటార్ల ద్వారా పంట కాలువలకు నీరు విడుదల చేసి రైతుల పంటలు ఎండిపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రైతుల పంటలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి మోటార్ల ద్వారా పంట పొలాలకు నీరు అందించిన ఎమ్మెల్యేని ఆయకట్టు రైతులు అభినందించారు.






కోవూరు మండలం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం 53వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్ బాల్ పోటీల ప్రారంభం దృశ్యం

## పచ్చిపులుసు నిధిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, డిసెంబర్22 ప్రభాతవార్త :** కావలి పట్టణ బృందావనం హౌసింగ్‌కాలనీ కళ్యాణమండపంలో ప్రముఖవ్యాపారనేత పచ్చిపులుసు వెంకటేష్ (వెంకన్న) పార్వతి దంపతుల కుమార్తె "నిధి" పుష్పాలంకరణ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే దగుమాటికి పూలవర్షంమధ్య వెంకన్న ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులు, పార్టీలనేతలు పాల్గొని నిధిని ఆశీర్వదించారు.

## టిడిపినేత చవల మనవడి నామకరణోత్సవంలో ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, డిసెంబర్22 ప్రభాతవార్త :** కావలి టిడిపి సీనియర్‌నేత, ఏరియా వైద్యశాల అభివృద్ధికమిటి సభ్యుడు చవల రామకృష్ణ, లక్ష్మీవల్లి దంపతుల మనవడి నామకరణ, బారసాల వేడుకలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకకృష్ణారెడ్డి ఆదివారం పాల్గొని ఆశీర్వదించారు. కావలి పట్టణ శివాలయం వీధిలోని కళ్యాణమండపంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే దగుమాటి టిడిపి నేతలతో తరలివెళ్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖులు, టిడిపి, జనసేన, బిజెపి నేతలు పాల్గొన్నారు.

## టెలికాం డైరక్టర్ గుర్రంకు అభినందనలు



**వలేటివారిపాలెం డిశంబరు 22, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ డైరక్టర్‌గా ఎంపికైనందకు గుర్రం మాల్యాద్రిని ఆదివారం మండలంలోని అయ్యవారిపల్లె ప్రధానోపాధ్యాయులు ముతకని హనుమంతరావు, చుండి వాల్మికి సంఘనేత గువ్వల నరసింహరావు, వలేటివారిపాలెం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గుర్రం లక్ష్మినరసింహంలు వేరువేరుగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసినందుకు కృతజ్ఞతగా ఈ పదవిని ఆయనకు కట్టబెట్టడంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ప్రశంసనీయమని వారు వ్యాఖ్యానించారు. ఈ పదవి ద్వారా మాల్యాద్రి ప్రజలకు సేవలు అందిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రన్న కానుకలు ఏవి?

**బిట్రగుంట డిసెంబర్ 22 ప్రభాతవార్త:** ఎన్డీఏ కూటమిలోని రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల హామీలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరికీ క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని చంద్రన్న కానుకలు ఇస్తామని హామీ ఇచ్చిందని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు శెట్టిపల్లి మల్లి పేర్కొన్నారు. బోగోలు లో ఆదివారం ' ప్రభాతవార్త ' తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ఆరు నెలలైనా మరో మూడు రోజుల్లో క్రిస్మస్, మరో 20 రోజుల్లో సంక్రాంతి పర్వదినాన్ని పేద మధ్యతరగతి బడుగు వర్గాలు ప్రజలు జరుపుకోనున్నారని, అయితే ఇంతవరకు వాటి ఊసే లేకపోవడం పట్ల ఎదురుచూసి నిరాశకు గురి అవుతున్నారని విమర్శించారు. ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వం కు అధికారం కట్టబెడితే పేదప్రజల ఆకాంక్షలు నెరవేరటంలేదాన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నూతన సంవత్సరం నుండి అయినా ఎన్నికల హామీ నెరవేర్చి చంద్రన్న కానుకలు పేదలకు అందించి వారి జీవితాలలో పండుగ కాంతులు నింపాలని డిమాండ్ చేసారు.

## అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి



**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావా లని తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. ఈ మేరకు ఆదివారం కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటేనే ప్రజల నుంచి వచ్చే అర్జీలకు తగు పరిష్కారం చూపే ందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి శాఖ అధికారి ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు



**వెంకటాచలం , డిసెంబర్ 22, ప్రభాతవార్త :** వెంకటాచలం మండలం చముడు గుంట లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైన్స్ సెంటర్ లో ఆది వారం జాతీయ గణిత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాల్గొ న్న వక్తలు మాట్లాడుతూ భారతీ య గణిత శాస్త్రవేత్త డాక్టర్ రామానుజన్ చేసిన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. విద్యార్థు లకు గణితం యొక్క ఆవశ్యకత, నిత్య జీవితంలో గణిత ప్రాము ఖ్యత గురించి డిసిఇబి సెక్రటరీ తాతా రామ్ కుమార్, రాపూరు మండలం గోనుపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఆచార్య నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సైన్స్ ఆఫీసర్ కరుణాకర్ రెడ్డి , విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ పల్లిపాడు శ్రీ పూండ్ల రమేష్ , ప్రధానోపాధ్యాయులు యం.వి.చలపతి (గంగపట్నం), నరసింహమూర్తి (మర్రిపాడు) ,రమేష్ (మను బోలు), గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**నెల్లూరు క్రైమ్ డిసెంబర్ 22, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన నెల్లూరు నగరంలో ఆదివారం చోటు చేసుకుంది. బుజబుజ నెల్లూరుకు చెందిన షేక్ ముంతాజ్ (37) తన అక్క కుమారుడితో కలిసి మోటార్ సైకిల్ పై ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూరు బస్టాండ్ నుండి బుజ బుజ నెల్లూరు వచ్చే క్రమంలో స్థానిక మినీ బైపాస్ రోడ్డు లోని టిడిపి ఆఫీస్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ గమనించక ప్రయాణించగా అకస్మాత్తుగా మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా ముంతాజ్ తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందుకున్న నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మహిళలకు చీరలు పంపిణీ



**వింజమూరు, డిసెంబర్22, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌లోని పరిశుద్ధ ఆత్మ క్రైస్తవ మందిరంలో ఆదివారం మహిళలకు చర్చ్ పాస్టర్ ఎం.ఏసుదాసు చీరలు పంపిణీ చేశారు. ముందుగా ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముందుగా పరిశుద్ధ ఆత్మ క్రైస్తవ మందిరానికి వచ్చే నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గతంలో దుప్పట్లు, చీరలు ఎంతోమందికి తమ ప్రార్థనా మందిరం ద్వారా అందించామన్నారు. 50మందికి చీరలు పంపిణీ చేశారు. ఈనెల 25న క్రిస్మస్‌ను పురస్కరించుకొని నూతన వస్త్రాలు ధరించాలనే సంకల్పంతో ప్రతి ఇంట్లో క్రిస్మస్ వెలుగులు ఉండాలనే సంకల్పంతో ఈకార్యక్రామన్ని చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## వైసీపీలో చేరిన తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకుడు



**గుడ్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గుడ్లూరు మండలం పరకొండపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చిరుతోటి ఏడుకొండలు వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. గుడ్లూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పులి రమేష్, ఏడుకొండలకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ గత ఐదేళ్లలో చెప్పిన మాట ప్రకారం సంక్షేమం అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారన్నారు. కందుకూరు నియోజకవర్గంలో బుర్రా మధుసూదన్‌యాదవ్ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలో చేరుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోల కొండయ్య, మాజీ సర్పంచ్ అల్లం బసవయ్య, చెరుకూరి బ్రహ్మయ్య, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

## మల్లిఖార్జున్‌రెడ్డిని పరామర్శించిన నుడా చైర్మన్



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కంచి మల్లిఖార్జున్‌రెడ్డిని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు. ఆదివారం నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న మల్లిఖార్జున నివాసానికి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వెళ్లారు. కాళ్ళు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న మల్లిని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు రూ.25వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో మల్లిఖార్జున్‌రెడ్డి ఎన్నో పోరాటాలు చేశారని, అలాంటి వ్యక్తి ఒక కాళ్లు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి తాను, తెలుగుదేశం పార్టీ, మంత్రి పొంగూరు నారాయణ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. అంచురి శ్రీనివాస్ నాయుడు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక నాయకులు దశరథరామయ్య, నరేంద్ర, వాసు, మాధవరావు, ఠాగూర్, సుమంత్, మాధవ్ పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం :** పార్లమెంట్ చర్చలో అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరుస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అవమానపరిచిన రాహుల్ గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా బైరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్‌ని అవమానించినదానికి అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేసి విగ్రహానికి పాలాభిషేకం చేసి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా బైరి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరినలు మాట్లాడుతూ రెండు సార్లు ప్రత్యక్ష ఎన్నికలలో డాక్టర్ అంబేద్కర్‌ని అవమానకర రీతిలో ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. దేశానికి ఎనలేని సేవ చేసిన డాక్టర్ అంబేద్కర్‌కి భారతరత్న ఇవ్వకుండా అవమానించిన చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. అలాంటి నీచ సంస్కృతి, చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ పేరు ఉచ్చరించే నైతిక హక్కు లేదన్నారు. 2014లో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడి మొదటి సారి పార్లమెంట్లో మాట్లాడుతూ నాలాంటి వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తి భారతదేశానికి ప్రధాని మంత్రి అయ్యాడంటే ఆ గొప్పతనం డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి దక్కుతుందని అన్నారు. అంబేద్కర్ జీవితంలో ముడిపడిన ఐదు ప్రాంతాలను పంచ తీర్థాలుగా అభివృద్ధి చేసిన ఘనత నరేంద్ర మోడీ, బీజేపీ దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షులు పరుశు మధు, జిల్లా కార్యదర్శి మంద శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అశోక్, నాయకులు రాములు, మదన్, రఘురామయ్య, సుబ్బారావ్, మస్తాన్ గౌడ్, కిషోర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి రూపంలో అంకమ్మ తల్లి



**విడవలూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గ్రామ దేవతగా వెలసియున్న శ్రీ అంకమ్మ తల్లికి ఆదివారం పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాల అలంకరణ చేశారు. సాయంకాలం అభిషేకం, కుంకుమార్చన పూల అలంకరణ, రాత్రి పల్లకి సేవ, భజన భక్త మండల వారిచే భక్తి గీతాలు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు కొర్నాగిరి, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు



**కోవూరు, డిసెంబరు22 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలుగా, కేడీలుగా అనుమానితులుగా రికార్డుకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో ముందుకు సాగకపోతే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎస్సై ఖాదర్‌బాషా హెచ్చరించారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రౌడీ మేళా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ కారణాల మూలంగా ఇటువంటి ముద్ర పడిన వారు తమ తీరును మార్చుకుని సన్మార్గంలో ముందుకు సాగాలన్నారు. లేనిపక్షంలో అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు.

## బలిజల ఆత్మగౌరవసభను జయప్రదంచేయాలి
## రాయలసీమ బలిజ మహాసభ అధ్యక్షుడు వెలిశెట్టి




**కావలి, డిసెంబర్22 ప్రభాతవార్త :** బలిజల ఆత్మగౌరవసభకు బలిజ కులస్తులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని రాయలసీమ బలిజ మహాసభ అధ్యక్షుడు వెలిశెట్టి శ్రీహరిరాయులు పిలుపునిచ్చారు. కావలి పట్టణ రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్బులో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం దగ్గర ఉన్న కాపు (బలిజ) భవన్‌నందు బలిజల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు బలిజ సోదరులందరూ కుటుంబసమేతంగా రావాలని తెలిపారు. కాపునాడు ఛైర్మన్ స్వర్గీయ మిరియాల వెంకట్రావు 85వ జయంతి, విజయవాడ శాసనసభ్యులు దివంగతనేత వంగవీటి మోహనరంగారావు 36వ వర్ధంతిలను పురస్కరించుకుని బలిజల ఆత్మగౌరవ సభను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిధిగా మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రమాదేవి దంపతులు హాజరవుతారని తెలిపారు. అలాగే తిరుపతి శాసనసభ్యులు అరని శ్రీనివాసులు, టిటిడి పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, శాసనమండలి సభ్యులు సి.రామచంద్రయ్య, కాపుకార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, మాజీ శాసనసభ్యులు వంగవీటి రాధాబాబులతోపాటు అనేకమంది మాజీ శాసనసభ్యులు, అతిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిధుల చేతులమీదుగా పేదబలిజ, మెరిట్ విద్యార్థులకు ఉపకారవేతనాలు, టాలెంట్ అవార్డులు, బలిజబంధు పురస్కారాలు అందచేయడం జరుగుతుందన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సభకు విచ్చేసిన బలిజ కుటుంబసభ్యులందరికి మధ్యాహ్నవిందు ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నువ్వుశెట్టి జనేష్, పాలడుగు వెంకటేశ్వరరావు, తోట ప్రభాకరరావు, పసుపులేటి శ్రీనివాసులు, కూనపరెడ్డి కేశవరావు, తోకల వెంకటేశ్వర్లు, బచ్చు ఉమారాజురాయల్, తదితరులు పాల్గొన్నారు.

## సంయుక్త సేవాసంస్థద్వారా పలు సేవాకార్యక్రమాలు



**కావలిరూరల్, డిసెంబర్22 ప్రభాతవార్త :** కావలి పట్టణం తుఫాన్‌నగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఆయన గురించి పోటీలు నిర్వహించి బహుమతులు అందచేయడం జరిగింది. అనంతరం కావలి పట్టణ ఇందిరానగర్‌వాసులు నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు మరియు సంయుక్తసేవాసంస్థ సభ్యులైనటువంటి గంధం ప్రసన్నాంజనేయులు వారి తమ్ముడు కావలి మొదటి నేత్రదాత కీర్తిశేషులు గంధంవీరాంజనేయులు జన్మదినం సందర్భంగా పట్టణంలోని సంయుక్తసేవాసంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేదవిద్యార్థులకు అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, విశ్రాంత అధ్యాపకులు యంవియన్ ప్రసాదరావు, మల్లేశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## తలకంటమ్మకు విశేష పూజలు



**కలువాయి డిసెంబర్ 22 ప్రభాతవార్త :** కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లి గ్రామదేవత శ్రీ తలకంటమ్మకు ఆదివారం భక్తులు విశేషపూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి దేవస్థానం నందు తలకంటమ్మకు, గ్రామదేవత శ్రీ గంగమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణను నిర్వహించారు. సాంప్రదా యబద్ధంగా అమ్మవారికి పొంగలిని పొంగించి నివేదన చేశారు. ఆదివారం కావడంతో దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు పెద్దఎత్తున దేవస్థానం మొక్కులు తీర్చుకున్నారు. చల్లారత్నయ్య, ధనమ్మ దంపతులు వారి కుటుంబసభ్యుల ఆద్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాల అనంతరం పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది.

## అయ్యప్ప స్వామిఆలయానికి వేమిరెడ్డి దంపతుల విరాళం



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 22, ప్రభాత వార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని శ్రీ ధర్మశాస్త్ర శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న సహస్ర కలశాభిషేకం, మహా మృత్యుంజయ హోమాలకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు 3 లక్షల విరాళం అందించారు. ఆదివారం ఈ మేరకు నెల్లూరులోని విపిఆర్ నివాసంలో ఆలయ ఛైర్మన్ శేషగిరి రావు, కమిటీ సభ్యులు పావుళ్ళ ప్రసాద్‌కి వేమిరెడ్డి దంపతుల తరఫున నగదును ఆయన అనుచరులు విరాళం అందించారు. శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో నేటి నుంచి 25వ తేదీ వరకు మహా మృత్యుంజయ హోమం, సుదర్శన హోమం, సహస్ర కలశాభిశేషకం జరగనున్నాయి. వీటికి ప్రధాన దాతలుగా వేమిరెడ్డి దంపతులు వ్యవహరించనున్నారు. ఈ నేపథ్యంలో 3 లక్షల విరాళం అందించి వారు భక్తిభావం చాటుకున్నారు.



## కూలిన స్లాబ్- తృటిలో తప్పిన భారీ ప్రమాదం



**కోవూరు డిసెంబర్ 22 ప్రభాత వార్త** రెండు దశాబ్దాల క్రితం గృహ నిర్మాణ శాఖ ఆద్వర్యంలో నిర్మించిన ఓ ఇల్లు అకస్మాత్తుగా స్లాబ్ మాత్రం కూలి ఇంట్లోని సామాన్లు పూర్తిగా ధ్వంసమైన సంఘటన వేగూరు గిరిజన కాలనీలో ఆది వారం జరిగింది. కోవూరు మండలం వేగూరు గిరిజన కాల నీలో నివసిస్తున్న ఈగ సుబ్బారావు సావిత్రమ్మలు కూలి నాలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. ఆదివారం వారిరువూరు ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. ఈనేపద్యంలో ఆదివారం మద్యహ్నం ప్రాంతంలో స్లాబ్ ఒక్కసారిగా పెద్ద శబ్బం చేస్తు కూలి పోయింది. ఈ సంఘటనలో ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తింగా ధ్వంసం అయ్యాయి అదృష్ట వశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది ప్రతి రోజు భార్యాభర్తలు ఇరువూరు ఇంట్లోనే నిద్రించే వారు అదే స్లాబ్ రాత్రి వేళలో కూలి ఉంటే పెద్ద ప్రాణాపాయం సంభవించేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంటిని చుట్టుపక్కల ప్రాంతాల నుండి గ్రామస్తులు వచ్చి పరిశీలించి అయ్యో అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబందిత శాఖ అధికారులు మండలంలో ఉన్నటువంటి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలి

### ప్రథమ స్థానం సాధించిన సత్యసాయి జిల్లా జట్టు



**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త** : కీడల్లో గెలుపు ఓటమిలు సమానంగా తీసుకునేలా ప్రతి క్రీడాకారులు ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాం జనేయులు తెలిపారు. కోవూరు మండలం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం 53వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్ బాల్ పోటీల ప్రారంభం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన ప్రథమ స్థానం సాధించిన సత్యసాయి జిల్లా జట్టుకు వెండి కప్పు మెడల్స్‌ను అందించారు. ఇటువంటి పోటీలకు వేదికగా పాటూరు ఉన్నత పాఠశాల నిలవడం శుభపరిణామమని, రానున్న రోజుల్లో ఈ క్రీడా ప్రాంగణం మరిన్ని రాష్ట్ర క్రీడలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం రెండవ స్థానం సాధించిన కడప జట్టుకు కప్పు, మెడల్స్‌ను అందించారు. మూడవ స్థానం సాధించిన నెల్లూరుజట్టుకు కప్పు , మెడల్స్‌ను అందించారు రాష్ట్ర వ్యాయామ విద్యా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. ప్రభాకర్‌రెడ్డి,పాటూరు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భీమతాటి వెంకటరమణయ్య ,జిల్లా హ్యాండ్ బాల్ కమిటీ కన్వీనర్ విక్టర్, . 16 జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, మేనేజర్లు ఉన్నారు.





## కేంద్ర మంత్రి పదవి నుండి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలి



**కందుకూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త** పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోమ్ మంత్రిని మంత్రి పదవి నుండి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విశాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బాబా సాహెబ్ అంబేద్కర్ని అవహేళన చేస్తూ మాట్లాడినందుకు నిరసనగా ఆదివారం కందుకూరులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పలువురు ఐక్యవేదిక నాయకులు అంబేద్కర్‌ని అవహేళనగా మాట్లాడిన కేంద్ర మంత్రిని భర్తరఫ్ చేయాలని, భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని, భారత ప్రజలకి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాన్ని ఇచ్చినటువంటి భారత రాజ్యాంగాన్ని సమస్త ప్రజలు కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ అసోసియేషన్ చిరంజీవి రామారావు, బీటీఏ ఉపాధ్యాయ సంఘ కల్లగుంట మోహన్‌రావు, షేక్ అబ్దుల్లా, సీపీఎం జి.వెంకటేశ్వర్లు, ఎస్‌కే గౌస్, సీపీఐ సురేష్‌బాబు, మాలకొండయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మహేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ చందర బోయిన నరేష్, వీసీకే పార్టీ ఆదినారాయణ, అడ్వకేట్స్ అసోసియేషన్ కిషోర్, చార్వాక అంబేద్కర్ బుద్దిష్ట్ అసోసియేషన్ గాండ్ల హరిప్రసాద్, మల్లిఖార్జున్, సామాజిక ఉద్యమకారులు పాలేటి కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, యువజన సంఘాల సూర్యనారాయణ, సీఐటీయు కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



**వింజమూరు,డిసెంబర్22,ప్రభాతవార్త:** వింజమూరులోని తిరుమలానగర్‌లో వేంచేసియున్న కలియుగ దైవం శ్రీ వెం కటేశ్వరస్వామి ఆలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వారి కుటుంబ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు కా కర్ల సంహిత్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఉదయాన్నే ఆలయానికి చేరుకొని ప్రదక్షణలు గావించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మె ల్యే తల్లిదండ్రులు వెంకటసు బ్బా నాయుడు-మస్తానమ్మలు మాట్లాడుతూ తన కుమారుడు కాకర్ల సురేష్ ఎన్నికల బరిలో నిలిచినప్పుడు తన మనుమడు సంహిత్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తన తండ్రి గెలుపుకోసం పాటుపడ్డాడన్నారు. ప్రతి గ్రామంలోని యువతతో కలిసి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమ స్యలను ఆనాడే స్వయంగా పరిశీలించి నాడు సురేష్‌కు ఈప్రాంత అభివృద్ధికి తమవంతు సహాయ సహ కారాలు అందించాలని సంహిత్ కోరాడన్నారు. అందులో భాగంగానే కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఈప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తమ తనయుడు కాకర్ల సురేష్ కృషి చేస్తాడన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఈప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేస్తారన్నారు. పొలిటికల్ వింగ్ మేనేజర్ మాలేపాటి చైతన్యనాయుడు, పూసల వెంగపనాయుడు, నర్సిం హనాయుడు, జూపల్లి వెంకటేశ్వర్లు, మలినేని పవన్‌కుమార్, జనసేన నాయకులు ఇమ్రాన్, గూడా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నువ్వా నేనా అనేలా సాగిన ఫైనల్ పోటీలు



**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త** : కోవూరు మండలం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం లో ఆదివారం నిర్వహించిన 53వ రాష్ట్రస్థాయి మహిళల హ్యాండ్ బాల్ పో టీల్లో ఫైనల్ పోటీ నువ్వా నేనా అనే రీతిలో సాగింది. కడప-సత్యసాయి జిల్లాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఇరు జట్లు క్రీడాకారులు తమ జట్లును గెలిపించేందుకు తీవ్రస్థాయిలో పోటీ పడ్డారు. కడప జిల్లా జట్టులోని క్రీడాకారిణిలు అత్యంత ప్రతిభ కనబరిచిన సత్యసాయి జిల్లా జట్టు క్రీడాకారిణిల ముందు తలవంచక తప్పలేదు. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు7 పాయింట్లు సాధించగా. కడఎజిల్లా జట్టు 2 పాయింట్లు సాధించి ఓటమి పాలైంది. . సత్యసాయి జిల్లా జటు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది.

## పోటాపోటీగా సాగుతున్న హ్యాండ్ బాల్ పోటీలు



**కోవూరు,పాటూరు డిసెంబరు 22 ప్రభాతవార్త** : కోవూరు మండలం పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహిస్తున్న 53వ రాష్ట్ర స్థాయి మహిళల హ్యాండ్ బాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో 16 జిల్లాల నుంచి వచ్చిన మహిళల జట్టు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్స్‌పోటీల్లో నెల్లూరు-కడప జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో కడప జట్టులోని పల్లవి అనే క్రీడాకారిణి అత్యంత ప్రతిభ కనబరిచి 5 గోల్స్ సాధించింది. మొత్తం ఈ సెమీ ఫైనల్స్ పోటీలో 13 పాయింట్లు సాధించగా.. నెల్లూరు జట్టు 2 పాయింట్లు సాధించి ఓటమిపాలైంది. మరో పోటీలో వెస్ట్ గోదావరి-సత్యసాయి జిల్లాల జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో సత్యసాయి జిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి తమ తమ జట్టు గెలుపుకు దోహదపడ్డాయి. సత్యసాయి జిల్లా జట్టు 7 పాయింట్లు సాధించగా.. వెస్ట్ గోదావరి జిల్లా జట్టు 2 పాయింట్లు సాధించి ఓటమి పాలైంది.

## ప్రాథమిక దశ నుంచి క్రీడల పట్ల దృష్టి సారించాలి





**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త** : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి క్రీడల పట్ల దృష్టి సారిస్తే వారిలో దాగి ఉన్న నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర వ్యాయామ విద్యా సంఘం ప్రధన కార్యదర్శి ఎన్. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం పాటూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 53వ రాష్ట్రస్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయన్నారు. విద్యార్థులు ఎంతసేపటికి చదువే కాకుండా క్రీడల పట్ల కూడా దృష్టి సారిస్తే వారి మేదస్సు మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వం కూడా పాఠశాలల్లో క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న ఈ మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలిసారిగా పాటూరు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ హ్యాండ్ బాల్ పోటీలను చక్కగా నిర్వహించేలా చర్యలు తీసుకున్న పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బీవీ రమణయ్యను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ పోటీల్లో ఉత్తమ ప్రతి కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి. రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు తప్పనిసరిగా క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతల్లో నిర్వహించిన ఈ పోటీలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి క్రీడాభిమానులు హాజరై క్రీడాకారులను ఉత్సాహ పరచడం శుభపరిణామం అన్నారు. క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెండుగా ఉద్యోగావకాశాలు కూడా వస్తాయని, ఆదిశగా ప్రతి విద్యార్థి దృష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు నాయుడు, నెల్లూరు హ్యాండ్ బాల్ కమిటీ కన్వీనర్ విక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 16 జిల్లాల నుంచి వచ్చిన అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కోచ్‌లు మేనేజర్లు ఉన్నారు.

## చికెన్ వేస్ట్ రవాణాకు అనుమతి లేదు



**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త** : కోవూరు సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో చికెన్ వేస్ట్ వాహనాలకు ఎటువంటి ప్రవేశం లేదని, అక్రమంగా ప్రవేశిస్తే ఆ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ చికెన్ వేస్ట్‌కు సంబంధించి ఇటీవల కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ వాహనాలు కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఏ ప్రాంతంలో కూడా ఈ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచనలిసచ్చారు. దీంతో బెంగుళూరు, చెన్నై నుంచి వస్తున్న ఈ చికెన్ వేస్ట్ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. గతంలో పగటి పూట వచ్చే ఈ లారీలు ప్రస్తుతం తమ పంథా మార్చి అర్థరాత్రి వస్తున్నాయని, వీటిపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం జరిగిందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఈ వాహనాలపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత చేప గుంటల యాజమానులు ఈ చికెన్ వేస్ట్ రవాణాను అనుమతిస్తే వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంగనాథ్ గౌడ్ ఉన్నారు.

## హనుమకొండపాలెంలో

## అక్రమమద్యం విక్రయాలపై దాడులు



**కావలి, డిసెంబర్22 ప్రభాతవార్త** జలదంకి మండలం హనుమకొండపాలెంలో చట్టవిరుద్దంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నవారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ ఎం.దేవిక, పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాసిన లక్ష్మిప్ర సన్న వద్దఉన్న 12 మద్యం సీసాలను స్వాధీనం చేసు కున్నారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసినట్లు దేవిక తెలిపారు.

## టిడిపి సభ్యత్వానికి విశేష స్పందన : కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** టిడిపి సభ్యత్వానికి విశేష స్పందన లభిస్తుందని టిడిపినాయకులు ,కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ పేర్కొ న్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగరపా లక పంచాయితీలో రెండో వవార్డు లో టిడిపి నాయకులు జూగుంట పురుషోత్తమ్, కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా కళ్యాణ్ మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి నాయకత్వంలో ము మ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి సభ్యత్వం చేసిన వారికి 5 లక్షల వరకు ఇన్సూరెన్స్ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందని అన్నారు. ఈ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి పార్టీ అండగా వుంటుందని అన్నారు. బూత్ ఇన్‌చార్జి కొలనేని సురేష్, జూగుంట మోహన్ పాల్గొన్నారు.

## దేశ చరిత్రలోనే అంబేద్కర్‌ను అవమానించింది కాంగ్రెస్‌పార్టీ

### బిజెపి నేతల ధ్వజం... రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం...



**కావలి, డిసెంబర్22 ప్రభాతవార్త** డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను దేశ చరి త్రలో అత్యంతగా అవమానపర్చింది కాంగ్రెస్‌పార్టీ అని బిజెపినేతలు ధ్వజ మెత్తారు. బిజెపి ఎస్సీమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం కావలి ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో రాహుల్‌గాంధి దిష్టి బొమ్మనుదగ్ధంచేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరుతో అడ్డగోలు రాజకీయాలు చేస్తున్న రాహుల్‌గాంధిపై కఠిన చర్యలు చేపట్టాలని నిరసన నినాదాల ప్రద ర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి నేతలు మాట్లాడారు. రాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను విమర్శించింది కాంగ్రెస్‌పార్టీ అని తెలిపారు. మంత్రి పదవికి రాజీనామా చేసేలా అంబేద్కర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి కేంద్రమంత్రివర్గం నుంచి బయటకు పంపించింది కాంగ్రెస్‌పార్టీ అని ధ్వజమెత్తారు. స్వంత కుటుంబసభ్యులకు భారతరత్న ఇచ్చి అంబేద్కర్‌ను విస్మరించిన ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అంబేద్కర్‌కు వారసులమని చెప్పే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రెండుసార్లు అంబేద్కర్‌ను ఓడించిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తుచేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అంబేద్కర్‌ను ఓడించిన ఘనతకూడా కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఈ దేశ రాజ్యాంగనిర్మాత అంబేద్కర్‌కు కాంగ్రెస్‌పార్టీ ఎందుకు భారతరత్న ఇవ్వలేదని ప్రశ్నించారు. ఓట్లకోసం కాంగ్రెస్‌పార్టీ నేతలు బిఆర్ అంబేద్కర్ వాసులమని చెప్పుకుంటున్నారన్నారు. అంబేద్కర్ నడియాడిన ప్రాంతాలను పంచతీర్థాలుగా బిజెపి సర్కార్ అభివృద్ధి చేసిందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చిన కాంగ్రెస్‌పార్టీ చరిత్రను, వాస్తవాల చిట్టాను అమిత్‌షా రాజ్యసభలో బయటపెట్టడంతో కాంగ్రెస్‌పార్టీనేతలు ఖంగుతిని బిత్తరపోయారన్నారు. రాజ్యసభలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి అసత్యప్రచారం కాంగ్రెస్‌పార్టీ చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సహకోశాధికారి కందుకూరి వెంకటసత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, బిజెపి పట్టణ అద్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం, అసెంబ్లి కన్వీనర్ సివిసి సత్యం, పట్టణ ప్రధానకార్యదర్శి మందా కిరణ్‌కుమార్, కూరాకుల సవీంద్ర, ఉపాధ్యక్షులు కోడూరు మురళికృష్ణ, వాయిగండ్ల సుధీర్, కార్యదర్శి గుడిపల్లి ప్రసన్న కుమార్, బిజెవైయం పట్టణ అద్యక్షులు పంది వెంకటసాయిమేఘనాథ్, మైనార్టీ మోర్చ పట్టణ అద్యక్షులు షేక్.మస్తాన్, బిజెవైయం పట్టణ ఉపాధ్యక్షులు మేదరమెట్ల మణిదీప్, సీనియర్ నాయకులు మట్టా మల్లికార్జున, పాదర్తి సుబ్బారావు, పాల్గొన్నారు.

## డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ కి సన్మానం



**విడవలూరు, డిసెంబర్ 22, ప్ర భాతవార్త :** ఈస్టన్ ఛానల్ డిస్ట్రి బ్యూటర్ కమిటీ ఇటీవల చైర్మన్ గా ఎంపికైన పాశం శ్రీహరి రెడ్డిని టిడి పి నాయకులు మడపర్తి రవీంద్ర మరికొందరు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సల వాలతో సన్మానం చేసి అభినంద న లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకుడికి చైర్మన్‌గా రెండోసారి ఎంపిక చేయడం సంతోషకరమైన విషయమని కొనియాడారు. ఐటిడి పి సత్యవోలు సత్యం రెడ్డి, దాసరి విజయ, పసుపు లేటి విజయ, కృష్ణమూర్తి, కందుకూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన గంగమ్మ ఉత్సవాలు



**వింజమూరు, డిసెంబర్22, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయితీ పరిధిలోని గంగమిట్టలో వేంచేసియున్న శ్రీగంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఆదివారం పొంగళ్ళు, ఆలయం చుట్టూ బండ్లుతిరగడంతో ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళలు పొంగళ్ళు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఆనంగి రాజేష్ కుటుంబ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి గుండ్లపల్లి కుటుంబ సభ్యులు ఆచారం ప్రకారం తమ నివాసం నుండి బండ్లు అలంకరించుకొని గుడి చుట్టూ తిప్పారు. సంకురాత్రి రమణయ్య కుటుంబ సభ్యులు తమ నివాసం నుండి బండి రంగురంగుల పూలతో అలంకరించి, బాణాసంచా మోతల మధ్య, భాజాభజంత్రీల వాయిద్యాల నడుమ పెద్ద ఎత్తున మహిళలతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ బండ్లు తిప్పారు. సాయంత్రం అశోక్ నగర్ నుండి గంగపట్ల తిరుపతయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి బండికట్టి ఇంటి నుండి మేళతాళాలాలతో గంగమిట్టకు చేరుకొని గుడిచుట్టూ ప్రదక్షణలు చేశారు. అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.